క్లుప్తంగా

న్యాయమూర్తి సాయిరామ్‌కు పదోన్నతి

నెల్లూరు (లీగల్): నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న సాయిరామ్‌కు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది.

సత్ప్రవర్తనతో మెలగాలి



వెంకటాచలం : జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చిన వ్యక్తులు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట వద్దనున్న జిల్లా కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ముందుగా జైలులో ఉన్న ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. తెలిసీ, తెలియక చేసిన తప్పులు మళ్లీ చేయవద్దని సూచించారు. జైలు జీవితం అనుభవించి బయటకు వెళ్లిన తరువాత కుటుంబసభ్యులతో అన్యోన్యంగా జీవించాలని తెలియజేశారు. లాయర్లు అవసరమైన వారికి ఉచితంగా ఏర్పాటు చేస్తామని, ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ సదస్సులో జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, జైలర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం ఆపరేటర్‌పై కేసు నమోదు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మినగల్లులో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీఎం ఆపరేటర్‌పై కేసు నమోదైంది. వివరాలు.. మినగల్లు అరుంధతీయవాడలో పేదలకు రేషన్ సరుకులు సరఫరా చేసే ఎండీఎం వాహనాన్ని పౌరసరఫరాల డీటీ మురళి బుధవారం తనిఖీ చేశారు. 223 కిలోల బియ్యం, 263 చక్కెర ప్యాకెట్లు, 49 కిలోల గోధుమలు ఎక్కువగా ఉండడాన్ని గుర్తించారు. డీటీ ఫిర్యాదు మేరకు వాహన ఆపరేటర్ ప్రకాశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర'కు క్రీడా స్థలం పరిశీలన



కోవూరు : 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు సంబంధించి అనువైన క్రీడా మైదానాల కోసం పరిశ్రమల శాఖ జీఎం కేపీ సుధాకర్ ఎంపీడీఓ శ్రీహరితో కలిసి బుధవారం కోవూరు పరిధిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో జరుగనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, షటిల్, ఖోఖో, కబడ్డీ పోటీలకు మండలంలో అనువైన క్రీడా మైదానాలను పరిశీలించినట్లు తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, వశిష్ట ఆంగ్ల మాధ్యమ పాఠశాల, గుమ్మలదిబ్బలోని ఉన్నత పాఠశాల, పాటూరు ఉన్నత పాఠశాలలోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ దేవిక గీతా మాధురి ఉన్నారు

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



పొదలకూరు : పొదుపు మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెడుతోందని, అందులో భాగంగానే డ్వాక్రా సంఘాలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేస్తోందని ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్పీ భానుచంద్ర తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం రోజ్‌మేరీ ఆధ్వర్యంలో ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్ లబ్ధిదారులకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగతంగా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పొదుపు మహిళలు రుణాలను తీసుకుని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించాల్సిందిగా సూచించారు. మహిళలు వ్యక్తిగతంగా యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలంటే 85550 73198 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పొదుపు మహిళలతో పాటు సీసీ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో పట్టణ ప్రణాళిక పాత్ర కీలకం

• కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్



పొదలకూరు రోడ్డులో మొక్కలు నాటుతున్న మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): క్రమశిక్షణతో కూడిన ఉన్నత సమాజ నిర్మాణంలో పట్టణ ప్రణాళికా విభాగం పాత్ర కీలకమని కమిషనర్ వికాస్‌మర్మత్ పేర్కొన్నారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రపంచ పట్టణ ప్రణాళికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళికా విభాగం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కార్పొరేషన్ పరిధిలోని టౌన్‌ప్లానింగ్ విభాగం, సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు నిర్వహిస్తున్న విధులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారి గుణశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ఉత్తమప్రతిభ కనబర్చిన ఐదుగురు వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ పోత్సాహకాలు అందజేసి అభినందించారు. అనంతరం మేయర్ స్రవంతితో కలిసి కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు డీకేడబ్ల్యూ కళాశాల రోడ్డులో మొక్కలు నాటి పచ్చదనాన్ని సంరక్షిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, సిటీ ప్లానర్ దేవీకుమారి, ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, ప్రదీప్‌కుమార్, ఎల్‌టీపీ అసోసియేషన్ నాయకులు, సివిల్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యానికి సహకరించాలి

• కమిషనర్ వికాస్‌మర్మత్



ఇరుగాళమ్మ సెంటర్ వద్ద స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరంలో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. నగరంలోని బట్వాడిపాళెం, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, చిన్నబజార్, తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం కమిషనర్ పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. చిన్నబజార్‌లో పండ్ల వ్యాపారులు రోడ్లపైన, కాలువల్లో వ్యర్థాలను పడేయడం గమనించి వారికి సూచనలు చేశారు. ప్రతి దుకాణం బయట తడి, పొడి చెత్త సేకరణకు విధిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద డస్ట్‌బిన్లు కనిపించేలా ఉంచి ప్రజలకు వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. దుకాణాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే నిర్వాహకులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని డ్రెయిన్లు, కాలువల్లో పూడికతీత పనులు క్రమం తప్పకుండా చేపట్టేలా పర్యవేక్షించాలని కార్పొరేషన్ అధికారులు, సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ వెంకటరమణ, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు ఉన్నారు.

వీఆర్ లా కళాశాలలో అడ్మిషన్లు చేపట్టాలని వినతి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నెల్లూరు (దర్గామిట్ట): నెల్లూరులోని వీఆర్ లా కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు నిర్వహించకుండా ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుందని, దీని వల్ల న్యాయ విద్యకు విద్యార్థులు దూరమవుతారని, యధావిధిగా అడ్మిషన్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓకు బుధవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా మొత్తానికి ఒకే లా కళాశాల ఉందని, ఎంతో మంది విద్యార్థులు న్యాయ విద్యను అభ్యసించాలని ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో విద్యామండలి వీఆర్ లా కళాశాలను బ్లాక్‌లిస్టులో పెట్టి అడ్మిషన్లు ఆపేస్తే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు యధావిధిగా జరిగేలా చూడాలని కోరారు. నగర సహాయ కార్యదర్శులు నరసింహ, సుమన్, సమీర్, విద్యార్థి నాయకులు నవీన్, వినోద్, సుకుమార్ పాల్గొన్నారు.

వీపీఆర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



ఎంపీ వేమిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న యువత

నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పలువురు యువత పేర్కొన్నారు. బుధవారం ఎంపీ వేమిరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సాయిభాస్కర్‌రెడ్డి, షేక్ నూర్ కళందర్, షేక్ షబ్బీర్, రాధాకృష్ణ, దండికట్టు శివప్రసాద్, మార్క్ మస్తాన్, కే కృష్ణ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరు, రాంనగర్, పొదలకూరురోడ్డు కాలనీ, బుచ్చి, కోవూరు, దామరమడుగు, బోడిగాడితోటకు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. వేమిరెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు శాయాశక్తుల కృషి చేస్తామని పేర్కొన్నారు.

కవయిత్రి మెహజబీన్‌కు సన్మానం



నెల్లూరు(బృందావనం): వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు–2023 అందుకున్న కవయిత్రి మెహజబీన్‌ను అభ్యుదయ రచయితల సంఘం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు టేకుమళ్ల వెంకటప్పయ్య మాట్లాడుతూ నెల్లూరులో జన్మించి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న మెహజబీన్ 20వ శతాబ్ది చివరి దశాకంలో అత్యంత ప్రభావశీలంగా కవితలల్లిన, సమకాలీన కవుల, విమర్శకుల మన్ననలు పొందిన అతికొద్ది మంది కవయిత్రుల్లో ఒకరని ప్రశంసించారు. ఆమె కవిత్వంలో స్త్రీవాద దృక్పథం గోచరిస్తుందని పేర్కొన్నారు.

బాణసంచా దుకాణాలకు లాటరీ



బాణసంచా దుకాణాలకు లాటరీ నిర్వహిస్తున్న ఆర్డీఓ మలోల

నెల్లూరు రూరల్: నగరంలోని నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఆర్డీఓ మలోలా బుధవారం లాటరీ నిర్వహించారు. నగరంలోని వీఆర్సీ, వైఎంసీఏ, ఆర్‌ఎస్సార్ స్కూల్ మైదానాల్లో దుకాణాల ఏర్పాటుకు నిర్వహించిన లాటరీకి పలువురు లైసెన్స్‌డ్ వ్యాపారులు హాజరయ్యారు. వీఆర్సీ మైదానంలో 54 దుకాణాలకు గానూ 36, వైఎంసీఏ మైదానంలో 25 షాపులకు గానూ 7, ఆర్‌ఎస్సార్ మైదానంలో 25 దుకాణాలకు గానూ 9 లాటరీ పద్ధతిలో కేటాయించారు. మిగిలిన దుకాణాలను గురువారం ఉదయం లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు.

'మనందరి కథలు' కథా సంపుటి ఆవిష్కరణ



మనందరి కథలు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న పెరుగు రామకృష్ణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రం సమీపంలోని అభ్యుదయ రచయితల సంఘ కార్యాలయంలో కరణం లక్ష్మీశైలజ రాసిన 'మనందరి కథలు' కథా సంపుటిని బుధవారం ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ కథా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. నెల్లూరుకు చెందిన కరణం లక్ష్మీశైలజ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారని, తాను రాసిన 'మనందరి కథలు' కథా సంపుటిని నెల్లూరులో ఆవిష్కరించాలన్న సంకల్పంతో ఇక్కడకు రావడం ఎంతో సంతోషకరమన్నారు. భవిష్యత్తులో సాహితీవేత్తగా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అభ్యుదయ రచయితల సంఘ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు గంగిశెట్టి శివకుమార్, టేకుమళ్ల వెంకటప్పయ్య పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం




నెల్లూరు (టౌన్): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి నరేంద్ర తెలిపారు. నగరంలోని కొన్ని విద్యా సంస్థలను వాటి యాజమాన్యాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్ పాటించాయని చెప్పారు. మరికొన్ని పాఠశాలల వద్దకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెళ్లి విద్యార్థులను ఇళ్లకు పంపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చరణ్, మనోజ్, కాశీఫ్, శివ తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యుడికి సత్కారం




నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిర దంత వైద్యశాల అధినేత వివేకానందరెడ్డిని బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీజీఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా జిల్లాలోని చిరుద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వారి ఆర్థిక పరిస్థితిని అనుసరించి డాక్టర్ వివేకానందరెడ్డి దంత వైద్యసేవలు అందిస్తుండడంతో సన్మానించినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మల్లంపూడి సతీష్‌కుమార్‌రెడ్డి, ఏపీజీఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి, జిల్లా కన్వీనర్ పిల్లి హరీష్‌రెడ్డి, జిల్లా ట్రెజరర్ మట్లే బాలరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు కే మల్లికార్జున, ఎం కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మప్రచార వారోత్సవాల విజయవంతంపై సన్మానం



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు ధర్మప్రచార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తెలిపారు. ధర్మప్రచార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఆలయ అర్చకులను బుధవారం సత్కరించారు. నరసింహకొండపై జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అమ్మో ఎయిడ్స్' నాటిక ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): నగరంలోని స్వతంత్ర పార్కులో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో 'అమ్మో ఎయిడ్స్' నాటికను బుధవారం ప్రదర్శించారు. కళాకారుడు ఆదిరెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 1న ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలను చైతన్యపరిచేందుకు నాటికను ప్రదర్శించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



నెల్లూరు (టౌన్): నగరంలోని కొండాయపాళెం దళితవాడలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, చైతన్య సొసైటీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ స్వరూప మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పేదల సొంతింటి కల సాకారం

• నగర మేయర్ స్రవంతి



మౌలిక వసతుల కల్పనపై అధికారులతో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని పేదల సొంతింటి కలను సాకారం చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మేయర్ పొట్లూరి స్రవంతి పేర్కొన్నారు. బుధవారం అల్లీపురంలోని టిడ్కో గృహ సముదాయాన్ని మేయర్ సందర్శించి మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాల్లో ని ఇళ్లు లేని పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో గృహ సముదాయాల్లో అన్ని సదుపాయాలతో ఇళ్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద టిడ్కో గృహ సముదాయమైన అల్లీపురంలోని 11,248 ఇళ్లను నెలరోజుల్లో అన్ని వసతులతో పేదలకు అందజేయనున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, అటువంటి నాయకుడికి మనందరం అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. త్వరలోనే టిడ్కో గృహ సముదాయాన్ని సీఎం వైఎస్ జగన్, నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు అందజేయనున్నట్లు తెలిపారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి



సింహపురి బీసీ శక్తి సదస్సులో పాల్గొన్న బీసీ సంఘాల నేతలు

నెల్లూరు(బృందావనం): బడుగు, బలహీనవర్గాల దైవాలైన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను విజయవాడలో ఏర్పాటు చేసి బీసీల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని పలువురు బీసీ నేతలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తల రమణయ్య, జిల్లా అధ్యక్షుడు పంచేటి భరత్‌నాగు పర్యవేక్షణలో పురమందిరంలో సింహపురి బీసీ శక్తి సదస్సును బుధవారం నిర్వహించారు. సమితి జిల్లా నేత ఆరంబాకం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో పలువురు బీసీ సంఘాల నేతలు పాల్గొని మాట్లాడారు. దశాబ్దాల క్రితం సమాజంలో అణగారిన వర్గాలుగా ఉన్న వెనుకబడిన తరగతుల ఉన్నతికి పూలే దంపతులు ఎంతో కృషి చేశారని కొనియాడారు. వారి కృషి ఫలితంగా నేడు బీసీలు సమాజంలో అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని వివరించారు. విజయవాడలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ సమీపంలో మహాత్మాజ్యోతిరావు పూలే 200, సావిత్రిబాయి పూలే 198 అడుగుల విగ్రహాల ఏర్పాటుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించాలన్నారు. అందుకు రానున్న ఏప్రిల్ 11వ తేదీలోగా శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో బీసీ భవనాలు నిర్మించి వాటికి పూలే భవనాలుగా నామకరణం చేయాలని కోరారు. నాడు–నేడు కింద బీసీ సంక్షేమ వసతిగృహాలను ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు వెనుకబడిన కులాల వారికి రెండెకరాలు భూమి ఇవ్వాలని, కులవృత్తులకు ప్రభుత్వం చేయూతనందించాలని కోరారు. నెల్లూరులో బీసీ భవన నిర్మాణాన్ని ఏప్రిల్ 11 పూలే జయంతిలోగా పూర్తి చేసి పూలే భవనంగా నామకరణం చేయాలన్నారు. సమాజంలో బీసీలు ఉన్నతంగా ఎదగాలంటే రాజకీయ చైతన్యంతో ఐక్యతగా ముందుకుసాగాలన్నారు. హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. బీసీలకు అన్ని పార్టీలు సముచిత స్థానం ఇవ్వాలన్నారు. విశ్రాంత న్యాయమూర్తి ఆర్ సంజీవయ్య, బీసీ సంఘాల నేతలు ఎస్‌ఎస్ యాదవ్, కావలి వెంకట్రావ్, తన్నీరు కోటయ్య, బెల్లంకొండ చిన్నయ్య, కిషోర్‌సింగ్, వావిలేటి ప్రసన్న, సత్యనారాయణ, రాధాకృష్ణ, వినుకొండ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, అమీర్‌జాన్, ఆనందయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి యాజమాన్యంపై అవగాహన



మంచినీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన పొదుపు సభ్యులు

నెల్లూరు(బారకాసు): మినిస్ట్రీస్ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అథారిటీ, నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్ ఆధ్వర్యంలో పట్టణాల్లో తాగునీటి సరఫరా యాజమాన్య పద్ధతులపై స్వయం సహాయక సంఘాల మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. పొదలకూరు మండలం మహ్మదాపురం వద్దనున్న నెల్లూరు కార్పొరేషన్ మంచినీటి శుద్ధి కేంద్రం వద్ద 'జల్ దివాలి' పేరుతో వాటర్ ఫర్ ఉమెన్ అండ్ ఉమెన్ ఫర్ వాటర్ అనే శీర్షికతో మెప్మా సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అమృత మిషన్ లక్ష్యం, ఈ మిషన్ ద్వారా పట్టణాలు, నగరాల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు, మంచినీటి ప్రాముఖ్యత, శుద్ధిచేసే విధానం, క్వాలిటీ కంట్రోల్ టెస్ట్, మంచినీటిని వృథా చేయకుండా ఎలా వాడుకోవాలి, తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ చంద్రయ్య, పబ్లిక్ హెల్త్ ఈఈ గిరిధర్, డీఈలు సురేష్, ప్రసాద్, మెప్మా అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంచిపురం మురగన్ షాపింగ్‌మాల్ ప్రారంభం



షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని మాగుంటలేఅవుట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాంచిపురం మురగన్ షాపింగ్ మాల్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం షాపింగ్‌మాల్‌ను పరిశీలించి షాపింగ్ చేశారు. తొలుత ఎంపీకు షాపింగ్‌మాల్ యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ కాంచిపురం మురగన్ షాపింగ్‌మాల్‌ను నెల్లూరులో ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. షాపింగ్‌మాల్‌లో అన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.